# ప్రభుత్వ విధానాలతో భారమవుతున్న విద్య

సమాజాభివృద్ధికి, మానవ వికాసానికి చోదకశక్తి విద్య. విద్యా విధానాలే ఆయా దేశాల పురోభివృద్ధికి సంకేతాలుగా వున్నాయి. అత్యధిక జనాభాగల చైనా అయినా, చిన్న దేశం ఫిన్‌లాండ్ అయినా అదే సందేశం ఇస్తున్నాయి.

మన దేశంలో స్వాతంత్ర్యం వచ్చి 68 యేళ్ళు గడిచినా అక్షరాస్యత 74%గా ఉంది. మన రాష్ట్రంలో చూస్తే అక్షరాస్యత 67% మాత్రమే ఉంది. స్త్రీలలో 59.74%. 2011 సర్వే ప్రకారం ఉమ్మడి రాష్ట్రంలో అక్షరాస్యత 40% లోపు ఉన్న మండలాలు 215 కాగా 40 నుంచి 55% లోపు ఉన్న మండలాలు 165 వున్నవి. 55%లోపు అక్షరాస్యత వున్న మండలాలు 383. అంటే ఉమ్మడి రాష్ట్రంలో 3వ వంతు మండలాలు అక్షరాస్యతలో రాష్ట్ర సగటుకన్నా వెనుకబడి వుండగా కర్నూలు జిల్లా అత్యంత వెనుకబడి వున్నది. ఈ గణాంకాలు మన పాలకుల నిర్లక్ష్యానికి నిదర్శనాలు.

## ప్రభుత్వ విద్యను నీరుగారుస్తున్నవైనం

గత రెండు దశాబ్దాలు విద్యపట్ల ప్రజల్లో ఆకాంక్ష పెరిగిన కాలం. ఈ కాలంలోనే ప్రభుత్వం వ్యూహాత్మకంగా 15 వేలమంది టీచర్ పోస్టులను నింపలేదు. 30% దాకా స్కూళ్లల్లో టాయిలెట్స్ అసలే లేవు. ఉన్నవి కూడా అరకొరగా ఉన్నవి. దాంతో విద్యార్థినులు చాలా యిబ్బందులు పడుతున్నారు. పర్యవేక్షక యంత్రాంగంలో రెండు జిల్లాలకి డిఇఓలు లేరు. హైస్కూళ్ళను పర్యవేక్షించే డిప్యుటి డిఇఓలు 75 పోస్టులుగాను 65 ఖాళీగా వున్నాయి. ఎంఇఓలు 665 మండలాలకు గాను 556 మండలాలకు లేరు. ఈ పరిస్థితి ప్రభుత్వ విద్యా సంస్థల్లో నాణ్యతను ధ్వంసం చేసింది. విద్యను అమ్ముకొనేందుకు, కొనుక్కొనేందుకు సరుకుగా మార్చాలంటే ఉచితంగా దొరికేదాన్ని నాణ్యతలేని పనికి రానిదిగా చేయాలి. ఈ విధానాలకు వ్యతిరేకంగా విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులే పోరాడాలి.

## లాభసాటి వ్యాపారంగా కార్పోరేట్ విద్య

నాణ్యమైన విద్య అంటే ఇంగ్లీషు విద్యే అనే అభిప్రాయం ప్రజల్లో కల్పించారు. మంచి చెడ్డతో నిమిత్తం లేకుండా నాణ్యమైన విద్యపేరుతో అనివార్యంగా ప్రైవేట్ స్కూళ్ళవైపు మొగ్గు పెంచారు. దేశంలో ఎక్కడా లేనివిధంగా మన రాష్ట్రంలో 48%మంది పిల్లలు ప్రైవేట్ స్కూళ్లకు వెళ్తున్నారు. ఇంటర్మీడియేట్ రెండు సంవత్సరాలకు కలిపి 9.3 లక్షలమంది ఉండగా ప్రభుత్వ, ఎయిడెడ్ జూనియర్ కాలేజీల్లో 2.7 లక్షలమంది చదువుతున్నారు. మిగిలిన 6.6 లక్షల మంది పిల్లలు కార్పొరేట్ ప్రైవేట్ కాలేజీల్లో చదువుతున్నారు. అంటే 70%మంది పిల్లలు ప్రైవేట్ కాలేజీల్లో ఉండగా అందులో నారాయణ, చైతన్య కలిపి సుమారు 5లక్షలమంది ఉన్నారు. లక్షల్లో ఫీజులు వసూలు చేస్తున్నారు. ప్రభుత్వ తప్పుడు విధానాలు కార్పొరేట్లకు వరంగా, ప్రజలకు పెనుభారంగా పరిణమించాయి. ఒక రకమైన గుర్తింపు కల్గిన ప్రైవేట్ స్కూల్స్‌లో కూడా పిల్లల డ్రెస్, ఫీజులు కలిపి 15 నుంచి 20 వేలవరకు వసూలు చేస్తున్నారు. విద్య లాభసాటి వ్యాపారంగా మారిపోయింది. **విద్యా వ్యాపారులే పాలకవర్గాల ప్రతినిధులైపోయారు.** అంచేత ప్రైవేట్ పాఠశాలలపై ప్రభుత్వ నియంత్రణ తగ్గిపోయింది. ఎవరికి ఇష్టమొచ్చినట్లు వారు ఫీజులు పెంచేసి వసూలు చేయడం మొదలు పెట్టారు.

## ఎంత ఎక్కువ ఖర్చు చేస్తే అంత మంచి చదువట!

ఎంత ఎక్కువ డబ్బు ఖర్చు చేస్తే అంత మంచి చదువు వుంటుందనే ధోరణిని ప్రచారంలో పెట్టి విపరీతంగా దోచుకొన్నారు. ప్రజలు తమ ఆదాయంలో సగభాగం పిల్లల చదువులకు ఖర్చు చేయాల్సిన స్థితి వచ్చింది. కొనలేనివాడికి లోన్లు కూడా ఇచ్చారు. ఆత్మహత్య చేసుకొన్న రైతుల్లో 40% మందివి పిల్లల చదువులకు చేసిన అప్పులే అని రిపోర్టులు చెబుతున్నాయి. పేద, మధ్య తరగతి వారు మంచి చదువులు చెప్పించాలని, ఉన్న కొద్దిపాటి ఆస్తులు, పొలాలు అమ్మి ఖర్చు చేస్తున్నారు. దివాళా తీస్తున్నారు. బ్రతకలేక గ్రామాలు వదిలి పట్టణాలకు వలసపోతున్నారు.

## విద్యను యాంత్రికంగా మార్చేసిన ప్రైవేట్, కార్పోరేట్ విద్యా సంస్థలు

అంత ఖర్చు చేసినా ఈ కార్పొరేట్ చదువులతో ఒరిగిందేమిటి? ఏదో కొద్దిమందికి ఐఐటిలు, సాఫ్ట్‌వేర్ ఉద్యోగాలు తప్ప. ఉపాధి అవకాశాలు తగ్గిపోవడంతో పిల్లలకు ఇంత చేసినా ఉద్యోగాలు లేవు. ప్రైవేట్ విద్యను యాంత్రికంగా మార్చాయి. బట్టీపట్టి చదవడం, పరీక్షల కోసం, గ్రేడులకోసం చదవడం తప్ప విలువలకు స్థానం లేకుండా చేశాయి. గొంతులు కోసుకునే పోటీ, తీవ్రమైన ఒత్తిడితో ఆత్మహత్యలకు పాల్పడే విద్యార్థులను చూస్తున్నాం. ప్రక్కవారిని ప్రేమించడం, సమాజంపట్ల బాధ్యత కలిగివుండడం లాంటి లక్షణాలు కనుమరుగౌతున్నాయి. ప్రశ్నించే తత్వంలేని తరాన్ని తయారు చేస్తున్నాయి. సమాజ భవిష్యత్‌కు ఇవి ప్రమాద ఘంటికలు.

అపార్ట్‌మెంట్లలో పాఠశాలలు, కాలేజీలు. లాబొరేటరీలు లేకుండా ప్రాక్టికల్స్, ఆట స్థలాలు అసలే వుండవు. అశాస్త్రీయమైన బోధనలతో మార్కులు తప్ప వ్యక్తి వికాసం లేని చదువులే ఇక్కడ చలామణి అవుతుంటాయి.

## పేదల పిల్లలపై ఇదేనా ప్రేమ

ప్రభుత్వ విద్యా వ్యవస్థలో కేజీ నుంచి పీజీ వరకు చదువుకున్న వారిలో 80% మంది ఎస్‌సి, ఎస్‌టి, బిసి, మైనార్టీలకు సంబంధించిన పేద విద్యార్థులే. కేరళలాంటి చోట్ల రాష్ట్ర బడ్జెట్‌లో 25% కేటాయిస్తుంటే మన రాష్ట్రంలో మాత్రం 13 శాతమే. రాష్ట్రంలో వున్న 20 రాష్ట్ర విశ్వ విద్యాలయాలు అన్ని రకాలుగా దివాళాలో వున్నవి. ములిగేనక్కపై తాటికాయ పడ్డ చందంగా వున్నా 5 ప్రైవేట్ యూనివర్శిటీలకు తోడు మరో 10 ప్రైవేట్ యూనివర్శిటీలు రానున్నాయని తెలుస్తున్నది.

## తల్లిదండ్రుల కమిటీలే ఫీజులు నిర్ణయించాలి

ప్రభుత్వ ఉత్తర్వులు జిఓ ఎంఎస్ నం. 1/94 ప్రకారం ప్రయివేటు పాఠశాల పరిపాలనా కమిటీలు వుండాలి. అందులో తల్లిదండ్రులు సభ్యులుగా ఉండాలి. ఫీజులు కమిటీ నిర్ణయించాలి. ఫీజుల వివరాలు బహిరంగంగా బోర్డులో ప్రకటించాలి. పాఠశాల నిర్వహణకు కమిటీ సూచనలు, సలహాలు పాటించాలి. ప్రైవేట్ స్కూళ్ళు తమకు కిలోమీటరు దూరంలో నివాసముండే దారిద్ర్య రేఖకు దిగువ వుండే కుటుంబాల పిల్లలను 25% మందిని స్కూళ్ళలో చేర్పించుకోవాలని విద్యాహక్కు చట్టం చెప్పింది. ఇంతవరకు రాష్ట్ర ప్రభుత్వం విధి విధానాలు నిర్ణయించకపోవడం వలన ఇవేవీ అమలుకావడంలేదు.

## చట్టం కావాలి

కార్పోరేట్ విద్యాలయాలలో ఫీజులు నియంత్రించాలని, చదువు బాగా సాగటానికి అవసరమైన మౌలిక వసతులు ఏర్పరచాలని, ర్యాంకుల మాయజాలం నుండి బయటపడి విద్యార్థులందరికి మెరుగైన విద్య కోసం కృషి వుండాలని, యాజమాన్యాలు అమలుచేసేలా రాష్ట్రంలో చట్టం చేయాలి. దీనికై తల్లితండ్రులు, విద్యార్థులు ఉపాధ్యాయులు సమైక్యంగా ఉద్యమించాలని సిపియం విజ్ఞప్తి చేస్తుంది.

తేది : 22.07.2015

విజయవాడ

అభివందనములతో...

**భారత కమ్యూనిస్టు పార్టీ (మార్కిస్టు)**

ఆంధ్రప్రదేశ్ కమిటీ